క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

అమరాపురం: గ్రామాల్లోని మహిళా సంఘాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ ఏపీఎం ముత్యాలప్ప కోరారు. శనివారం దేవగానపల్లిలో రాఘవేంద్ర గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ముత్యాలప్ప మాట్లాడుతూ ప్రతి సంఘ సభ్యురాలు లైవ్‌లీహుడ్ పథకంలో భాగంగా బ్యాంకులో రుణాలు పొంది పాడి ఆవులు, గొర్రెలు మేకలు తదితర కొనుగోలు చేయవచ్చన్నారు. తద్వారా వాటిని పోషించుకుని ఆర్థికంగా బలోపేతం కావచ్చన్నారు. కార్యక్రమంలో సీసీలు, యానిమేటర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఐ ఇషాక్‌బాషా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణనాయక్, వలస హెచ్‌ఎం. శ్రీనివాసమూర్తి, మాజీ జెడ్పీటీసీ నరసింహమూర్తి ప్రారంభించారు. సచిన్ టెండుల్కర్ వారియర్స్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. విన్నర్స్‌కు శివకుమార్‌యాదవ్ రూ.20,001, రన్నర్స్‌కు బాలాజి రూ.15,001 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోతగానహళ్లి అధ్యక్షురాలిగా పుష్పావతి

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళి కి చెందిన పోతగానహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతురాలు పుష్పావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికల్లో పుష్పావతి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఈఓ బీకే ఉత్తమ్ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిని గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

విద్యతో పాటు నైతిక విలువలు ప్రధానం



మాట్లాడుతున్న ఎస్కేయూ ఎవాల్యుయేషన్ డైరెక్టర్ జీవీ రమణ

పెనుకొండ: విద్యతో పాటు నైతిక విలువలు ఎంతో ప్రధానమని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ ఎవాల్యుయేషన్ డైరెక్టర్ జీవీ.రమణ పేర్కొన్నారు. పట్టణంలోని సత్యసాయి జూనియర్ కాలేజీలో శనివారం జూనియర్ ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ రమణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ నరసింహమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి, ఏఓ కేశవయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకులు విద్యావంతులుగా ఎదగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

పావగడ: వాల్మీకులు విద్యావంతులుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బళ్లారి మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప సూచించారు. వైఎన్ హొసకోటలో మహర్షి వాల్మీకి నాయక సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు ఆయన హాజరై మాట్లాడారు. వాల్మీకులు సంఘటితమై తమ హక్కుల కోసం పోరాడి సాధించే దిశగా ముందుకు అడుగులు వేయాలన్నారు. మాజీ మంత్రి బళ్లారి శ్రీరాములు మాట్లాడుతూ వాల్మీకులు రాజకీయాలతో ముడి పెట్టకుండా కలసి కట్టుగా ఉండాలన్నారు. మాజీ మంత్రి కేఎన్ రాజణ్ణ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎత్తు పల్లాలు సహజమని అయితే ప్రజా సేవకు ప్రాధాన్యత కల్పించి ప్రజల బాగోగులను పరిరక్షించేవాడే నిజమైన నాయకుడన్నారు. వాల్మీకి విగ్రహ శిల్ప కళాకారుడు నవీన్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. వాల్మీకి సంజయ కుమార స్వామి, స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు



అగళి -ఇరిగేపల్లి సమీపంలో రహదారిపై ప్రమాదకర మలుపు

అగళి: మండలంలోని 544 జాతీయ రహదారిపై మలుపులు ప్రమాదకరంగా మారాయి. పెనుకొండ నుంచి వయా కర్ణాటక రాష్ట్రంలో శిరా వరకూ దాదాపు 14 మలుపులు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఐవరుపల్లి, మడకశిర, ఇరిగేపల్లి, రామనపల్లి, పి బ్యాడగేర, రొళ్లకొండ, కొడగార్లగుట్ట తదితర గ్రామాల వద్ద వచ్చే మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ మలుపుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 12 మంది మృతి చెందారు. దాదాపు 41 మంది గాయాలపాలయ్యారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రమాదకర మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్‌తో పరేషాన్..



రోడ్డుపైన నిలిపిన ద్విచక్రవాహనాలు

పెనుకొండ: పట్టణంలోని కృష్ణదేవరాయ రోడ్డులో ద్విచక్రవాహనాల పార్కింగ్‌తో ప్రజలు పరేషాన్‌కు గురవుతున్నారు. కృష్ణదేవరాయ విగ్రహం నుంచి దర్గా సర్కిల్ వరకు రోడ్డుకు అటు, ఇటు ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారు. ఈ రోడ్డు వాహనాల రాకపోకలు, పాదచారుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈక్రమంలో ద్విచక్రవాహనాలను రోడ్డుపై నిలపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ద్విచక్రవాహనాలను రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



జీవీ పాళ్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

మడకశిరరూరల్: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ శ్రేణులకు సూచించారు. జీవీపాళ్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు, పూర్తి స్థాయిలో అమలు కానీ సూపర్ సిక్స్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే సూపర్ సిక్స్‌లో కొన్నింటినైనా ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 17 నెలలైనా ఇప్పటి వరకు ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్‌పై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. అప్పులు చేసి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అంతకుముందు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మెళవాయి పంచాయతీలోని సింగేపల్లి గ్రామంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు సిద్దగంగప్ప తెలిపారు.

రచ్చబండ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

మడకశిర నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగే రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, జిల్లా, తాలుకా మండల, గ్రామ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సరస్వతీ నమస్తుభ్యం

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వివిధ ఆలయాల్లో అమ్మవార్లను పలు రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – సాక్షి బృందం:



రత్నగిరిలో సరస్వతిదేవిగా కొల్హాపురి మహాలక్ష్మీదేవి



హిందూపురం: రంగనాథస్వామి అలంకరణలో బోయికొండ గంగమ్మదేవి



అమరాపురం: అలంకరణలో చోళమాంబదేవి



మడకశిరలో లలిత త్రిపుర సుందరిగా వడిశలమ్మ



రొద్దం: ప్రత్యేక అలంకరణలో రేణుకయల్లమ్మ



పెనుకొండ: పసుపు, కుంకుమ అలంకరణలో వాసవీమాత



పరిగి: లలిత త్రిపుర సుందరిగా సప్తమాతృక అమ్మవారు



లేపాక్షిలో లలితాదేవిగా దుర్గాదేవి

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పావని

పరిగి: మండలంలోని ఐకాన్ జూనియర్ కళాశాల విద్యార్థిని పావని జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 24, 25 తేదీల్లో ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో భాగంగా ఫుట్‌బాల్ జట్టులో పావని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధి సురేష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఇంటర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు బాబాఖాన్, బైరిశెట్టి, అకడమిక్ డీన్ వెంకటనందన్, ఏఓ అశ్విని, పీడీలు శంకర్, కార్తీక్ తదితరులు పావనిని అభినందించారు.

ప్రజారోగ్యంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

హిందూపురం టౌన్: ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో కౌన్సిలర్లకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాహస్ సంస్థ ప్రతినిధులు మురళి, జెస్లిన్, అశ్విన్ సుస్థిర పట్టణాభివృద్ధిపై వివరించారు.

మడకశిరలో 'స్వచ్ఛోత్సవ్'

మడకశిర: పట్టణంలోని పాత మార్కెట్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం జరిగింది.ఈసందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మార్కెట్‌లో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, వైస్ చైర్‌పర్సన్లు వెంకటలక్ష్మమ్మ, ప్రభావతి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మొక్కల మధ్య ఎడం పాటిస్తే మంచి దిగుబడి

హిందూపురం: మల్బరీ సాగులో మొక్కల మధ్య ఎడం పాటిస్తే మంచి దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్త డాక్టర్ రమ్య, జెడీ శోభారాణి సూచించారు. నా పట్టు నా అభిమానం కార్యక్రమంలో భాగంగా శనివారం హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో పట్టు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత రమ్య మాట్లాడుతూ మల్బరీ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సెరికల్చర్ ఏడీ రత్నం, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నూతన భవనాలు మంజూరు చేయించాలి



పరిపాలన న్యాయమూర్తికి సమస్యలు వివరిస్తున్న న్యాయవాదులు

హిందూపురం: పట్టణంలో కోర్టు భవనాలను మంజూరు చేయించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జి.రామకృష్ణ ప్రసాద్‌ను కోరారు. శనివారం అనంతపురానికి విచ్చేసిన పరిపాలనా న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నేరప్ప, న్యాయవాదులు ఇందాద్, శివశంకర్ కలిసి సమస్యలను వివరించారు. హిందూపురంలో పాత జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం శిథిలావస్థకు చేరడంతో ఇప్పటికే కూలదోసేందుకు అనుమతి ఇచ్చారని, ఇందులో సంబంధిత అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని తెలిపారు. పాత అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం 1966లో నిర్మించారని, ప్రస్తుతం ఆ భవన సముదాయంలోని ఉపఖజానా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం వంటి కార్యాలయాలను నిర్వహిస్తున్నారన్నారు. కోర్టు భవనం మాత్రమే మార్పు చేశారు. ఈ భవనాన్ని స్మారక భవనంగా ఉపయోగించుకునేందుకు అనుమతించాలని కోరారు. ప్రస్తుతం రెండుచోట్ల న్యాయస్థానాల నిర్వహణ కష్టంగా ఉందని, దీని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన నూతన భవనాల మంజూరుకు సహకరించాలని విన్నించారు. సమస్యలపై న్యాయమూర్తి సానుకూలంగా స్పందించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు.

నిబంధనలు అతిక్రమించే వారిపై పీడీ యాక్ట్



తూమకుంట చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

హిందూపురం టౌన్/ మడకశిర: నిబంధనలు అతిక్రమించే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. శనివారం ఆయన హిందూపురం, మడకశిర ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్ల పలు రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను, మద్యం అక్రమ రవాణాపై సిబ్బందికి సూచనలు చేశారు. కల్తీ కల్లు విక్రయదారుల మీద పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. ఎక్సైజ్ సీఐలు లక్ష్మీదుర్గయ్య, మురళీకిషోర్, ఎస్‌ఐ శంకర్ ఉన్నారు.

'చిరంజీవిని దూషించినా పవన్‌కల్యాణ్‌కు పట్టదా?



మీడియాతో మాట్లాడుతున్న నరసింహమూర్తి

మడకశిర: బాలకృష్ణ అసెంబ్లీలో చిరంజీవిని ఇష్టానుసారంగా దూషించినా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టదా అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి విమర్శించారు. ఆయన శనివారం మడకశిరలో మీడియాతో మాట్లాడుతూ సొంత అన్నను అసెంబ్లీలో అవమానించినా పవన్‌కల్యాణ్ స్పందించక పోవడం చాలా దారుణమన్నారు. పవన్‌కు అన్న గౌరవం కన్నా పదవే ముఖ్యమని ఆరోపించారు. పవన్‌కల్యాణ్ వ్యవహారశైలిపై చిరంజీవి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. బాలకృష్ణనే అసలైన సైకో అని, వైఎస్‌జగన్‌ను విమర్శించే స్థాయి ఆయన కాదన్నారురు.నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే రాష్ట్రంలో తిరగలేవని హెచ్చరించారు. వెంటనే వైఎస్‌జగన్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మడకశిర: ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో చిరంజీవిని దూషించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అంజలి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బాలకృష్ణ తన అన్నను దూషించినా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మౌనంగా ఉండడం చేతకానితనమని ధ్వజమెత్తారు.

మడకశిరరూరల్: ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో సినీనటుడు చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు శేషాద్రి, సీనియర్ నేత మంజునాథ్ శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బాలకృష్ణ వాఖ్యలు సమాజం తలదించుకోనేలా ఉన్నాయని, వెంటనే ఆయన చిరంజీవి, వైఎస్ జగన్‌మోహనరెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'రచ్చబండ'

రొళ్ల/ అమరాపురం: రొళ్ల, అమరాపురం మండలాల్లోని అన్ని పంచాయతీల్లో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, అమరాపురం మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అగళి/ గోరంట్ల/హిందూపురం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అగళి, గోరంట్ల తహసీల్దార్లు సుబ్బారావు, మారుతి, హిందూపురం డీటీ మైనుద్దీన్ సూచించారు. శనివారం అగళి మండలం ఆలూడి, గోరంట్ల మండలం బూదిలి ఎస్సీకాలనీ, హిందూపురం మండలం కగ్గల్లులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ చట్టాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సుధాకర్ ప్రసాద్ సేవలు మరువలేనివి

హిందూపురం: రెవెన్యూ ఉద్యోగుల కోసం సంఘం నేతగా తోట సుధాకర్ ప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతిని పురస్కరించుకుని రెవెన్యూ ఉద్యోగులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం: పట్టణంలో పాత మార్కెట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన భవాని కౌశిక్ శనివారం రూ.2,01,116 విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, నిమ్మకాయల రాము పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

మడకశిరరూరల్: యూ రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ సశ్మక్తి పరివార్ అభియాన్ కార్యకమం నిర్వహించారు. డాక్టర్ నరేష్‌కుమార్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య పరంగా ఏ సమస్య వచ్చిన నిర్లక్ష్యం చేయకుండా వైద్యం పొందాలన్నారు. రక్తహీనత రాకుండా ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

గుడిబండ: మోరబాగల్ వీఆర్‌ఏ గోవిందప్ప (62) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందాడు. తహసీల్దార్ శ్రీధర్, డీటీ కల్యాణ్ చక్రవర్తి గ్రామానికి చేరుకుని గోవిందప్ప మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ధార్మికతతో మానవ జన్మ సార్థకం

పావగడ: ధార్మికతతో మానవ జన్మ సార్థకం అవుతుందని వాల్మీకి సంజయ కుమార స్వామి ప్రశంసించారు. తాలూకా లోని సీకే పురం గ్రామంలో శనివారం నిర్వహించిన ధార్మిక సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తాలూకా యోజనాధికారి మహేశ్, తుమకూరు 2 జిల్లా డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ధర్మ స్థల గ్రామాభివృద్ధి యోజన అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వరమహాలక్ష్మి, పూజ, ధార్మిక సభ ప్రాధాన్యతను వివరించారు. స్థానిక గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, సభ్యులు, పాల సహకార సంఘం డైరెక్టర్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ నేత మనోజ్ జూలియట్(మింటూ) ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక జట్లతో కలుపుకుని 31 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకుడు మింటూ తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, ఉమర్ ఫారూక్, శాంతరాజు, శీన, శ్రీరాములు, దాదాఖలందర్, సిరాజ్, పీడీ మహేష్, చిన్నకొండప్ప, వెంకటేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

మడకశిరరూరల్: తడకలపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు..కల్లుమర్రి క్రాస్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న కారు వెనుక నుంచి వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఘటనలో బైక్‌పై ఉన్న హిందూపురం వాసులు ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

అగళి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కారిదాసన్నపల్లికి చెందిన రంజిత, నందిత స్కూటర్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయడిన ఇద్దరినీ స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రొళ్ల: కొడగార్లగుట్ట కాలనీ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిన ఘటనలో కర్ణాటకకు చెందిన నాగరాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డారు. వెంటనే అతడిని హైవే అంబులెన్స్ ద్వారా రొళ్ల సీహెచ్‌సీకి తరలించారు.

కార్యదర్శికి తీవ్రగాయాలు

సోమందేపల్లి: నల్లగొంద్రాయానపల్లి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయితీ కార్యదర్శి కృష్ణప్రసాద్ గాయపడ్డారు. వివరాలు.. కృష్ణప్రసాద్ గోరంట్ల వైపు నుంచి సోమందేపల్లికి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం ఆయన్ను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చిత్తూరు జిల్లాలో పని చేస్తున్నారు. గతంలో సోమందేపల్లి మండలం మాగేచెరువు కార్యదర్శిగా పని చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



ఊటుకూరులో జ్యోతులు మోస్తున్న మహిళలు

పరిగి: ఊటుకూరులో శనివారం జ్యోతుల ఉత్సవం వైభవంగా జరిగింది. స్థానిక దండు మారెమ్మ ఆలయం నుంచి మహిళలు జ్యోతులను నెత్తిమీద పెట్టుకుని గ్రామంలోని వీధుల్లో మేళతాళాల, డప్పుల నడుమ ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం చిలమత్తూరు కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ట్రాక్టర్ల ద్వారా చేరుకుని స్వామి వారికి జ్యోతులను సమర్పించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9494767933, 9912220726